జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 3-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 526 పేజీలు: 4 వెల : రూ.7

# ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో!



* గాడి తప్పిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ
* సమయపాలన పాటించని సిబ్బంది
* జాడలేని బయోమెట్రిక్
* ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కార్యాలయాలు
* కొరవడిన అధికారుల పర్యవేక్షణ
* సిబ్బంది వచ్చే వరకూ లబ్ధిదారులు పడిగాపులు





**ఎల్ఎన్‌పేట, డిసెంబర్ 2 (వార్త):** గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ నేడు గాడి తప్పింది. సచివాలయ సిబ్బంది విధులకు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని దుస్థితి. గతంలో యూనిఫారం ఉండేది.. ప్రస్తుతం దాని ఊసే లేదు. బయోమెట్రిక్.. నామమాత్రమైంది. సిబ్బంది ఎప్పుడు వస్తారు అని ఎవరినైనా అడిగితే ఫీల్డ్.. అనే నిర్లక్ష్యపు సమాధానం వస్తోంది. పర్యవేక్షించే నాథుడు లేక కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సిబ్బంది రాక కోసం ప్రజలు గంటల తరబడి సచివాలయం భవనం ముందు పడిగాపులు కాయాల్సివస్తోంది. కొందరు సిబ్బంది రాజకీయ నేతల అండదండలతో పేట్రేగిపోతున్నారు. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చినందున.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థపై పెద్దగా ఆసక్తి కనబరచడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



## సచివాలయ సిబ్బందిపై డిప్యూటీ ఎంపీడీవో ఆగ్రహం

లక్ష్మీనర్సుపేట, పెద్దకోట-1 సచివాలయానికి ఎల్ఎన్‌పేట డిప్యూటీ ఎంపీడీవో జి.వెంకట అప్పలనాయుడు మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు తనిఖీ నిమిత్తం వెళ్లారు. ఆ సమయంలో ఆయా సచివాలయాల్లో ఖాళీ కుర్చీలే కనిపించాయి. ఏ ఒక్క సిబ్బంది కూడా లేరు. 11 గంటల వరకూ సచివాలయంలోనే ఆయన వేచిచూశారు. సచివాలయం ఎదుట పింఛన్ ధారులు, ఇతర లబ్ధిదారులు వివిధ పనుల మీద పడిగాపులు కాయడం కనిపించింది. ఏయే పనుల మీద వచ్చారని ఆయన వాకబు చేశారు. 11.05 గంటలకు ముగ్గురు సచివాలయ ఉద్యోగులు వచ్చారు. ఆలస్యమేంటని ఆయన వారిని ప్రశ్నించగా ఫీల్డ్‌కు వెళ్లామని నిర్లక్ష్యంగా చెప్పడం కనిపించింది. ఆ తర్వాత పలు రికార్డులతో పాటు హాజరుపట్టీని డిప్యూటీ ఎంపీడీవో పరిశీలించారు. హాజరుపట్టీలో సైతం కనీసం సంతకాలు పెట్టకుండా సిబ్బంది ఉండడాన్ని గమనించి అవాక్కయ్యారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా.. మౌనమే వారి సమాధానం అయింది. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా డిప్యూటీ ఎంపీడీవో పలువురు గ్రామస్తులతో మాట్లాడగా ఏ ఒక్క రోజు కూడా సచివాలయం సిబ్బంది సమయానికి రారని వాపోయారు. ఇక్కడ సిబ్బంది పూర్తిస్థాయిలో లేరని పేర్కొంటున్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో జి వెంకట అప్పలనాయుడును తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నందిగాం మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఎల్ఎన్‌పేట మండలంలోని 12 సచివాలయాలకు పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టనున్నట్టు చెప్పారు. ప్రతిరోజూ సచివాలయాలను సందర్శిస్తానని, సమయపాలన పాటించని సిబ్బందిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని తెలిపారు.

# థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్ణయం ఉపసంహరించకపోతే.. ప్రతిఘటన తప్పదు

* ఆదివాసీలతో ఆటలాడొద్దు
* కూన రవి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు
* పరాభావం చాలదా?
* ప్లాంట్‌పై బహిరంగ చర్చకు సిద్ధమా
* థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు

**ఆమదాలవలస, డిసెంబర్ 2 (వార్త):** థర్మల్ పవర్‌ప్లాంట్‌పై ఆదివాసీలు చేపడుతున్న ఉద్యమం పట్ల ఎమ్మెల్యే కూన రవికుమార్ చులకన భావంతో మాట్లాడుతున్నారని, సమయం వచ్చినపుడు తగిన గుణపాఠం చెబుతామని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్మాణం ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని లేకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. మంగళవారం ఆమదాలవలసలో కమిటీ కన్వీనర్ వాబ యోగి, అధ్యక్షుడు సురేష్ దొర, కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి రవికాంత్, సీపీఐ జిల్లా నాయకులు చాపర వెంకటరావు మీడియాతో మాట్లాడారు. ఉద్యమాల పట్ల చులకనగా భావంతో ఎమ్మెల్యే మాట్లాడటం తగదన్నారు. పవర్ ప్లాంట్ పేరుతో ఆదివాసీల బతుకులు బుగ్గిపాలు చేయొద్దని పోరాడుతుంటే, అవగాహన లేని వాళ్లు ఇక్కడ మాట్లాడుతున్నారని కూన రవికుమార్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. పవర్ ప్లాంట్ వల్ల వచ్చే నష్టాలు ఏంటో వివరిస్తామని, బహిరంగ చర్చకు సిద్ధమా అని వారు సవాల్ విసిరారు. పవర్ ప్లాంట్ పేరుతో ఆదివాసి గ్రామాలకు కూన రవి వెళితే.. ఆయా గ్రామస్థులు అడ్డుకున్నారన్నారు. మా గ్రామాలకు రావద్దు అని ఫ్లెక్సీ బోర్డులు కట్టారన్నారు. ఈ పరాభావం చాలదా అని ప్రశ్నించారు. ఆదివాసీలకు వ్యతిరేకంగా ముందుకువెళితే రాజకీయంగా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్వలాభం కోసం వేలాది ఎకరాల భూములను తీసుకొని ప్రజలకు సర్వనాశనం చేసే థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల ఎన్ని ఉద్యోగాలు ఇస్తారని వారు ప్రశ్నించారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో పదివేల ఎకరాల పంట భూములు నాశనమవుతాయన్నారు. ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఎవరు ఆదుకుంటారన్నారు. ఆదివాసీల పక్షాన రైతాంగం, పర్యావరణ వేత్తలు, మానవ హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, పర్యావరణ వేత్తలు, వామపక్ష నేతలు ఉన్నారన్నారు. వారందరితో కలిసి థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు పోతుందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సవర లక్ష్మణరావు, పోరాట కమిటీ సభ్యులు కువ్వారి, సవర మనోజ్, సవర నగేష్, సవర సింగయ్య, బొత్స సంతు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

### థర్మల్ వ్యతిరేక పోస్టర్లు దహనం

సరుబుజ్జిలి: థర్మల్ ప్లాంట్ వద్దంటూ వెన్నెలవలసలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సురేష్ దొర, కోశాధికారి అత్తులూరి రవికాంత్ ఆధ్వర్యంలో గిరిజనులు థర్మల్ వ్యతిరేక పోస్టర్లను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణం థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.





## వృద్ధురాలు ఏమైంది?

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 2 (వార్త):** లావేరు మండలం మురపాకకు చెందిన వృద్ధురాలు పార్వతమ్మ (65) సోమవారం ఆవులను మేతకు తీసుకువెళ్లింది. మధ్యాహ్నం మూడు గంటలు అవుతున్నా ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబీకులు సమీపంలోని తోటలు, ఇతర చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఆమె కుమారుడు లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వృద్ధురాలి మెడలో రెండున్నర తులాల బంగారం ఉందని, పొలంలో ఒక చోట విరిగిన గాజులు, చెప్పులు, రక్తపు మరకలు గుర్తించినట్టు పోలీసులకు తెలిపారు. దీంతో లావేరు, రణస్థలం ఎస్సైలు కె.అప్పలసూరి, ఎస్.చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించారు. బంగారం కోసం ఎవరైనా ఆమెను హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

**జి.సిగడాం, డిసెంబరు 2(వార్త):** జాడ గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ మంగళవారం ఆర్థిక సాయం అందించారు.

ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచనలతో గ్రామానికి చెందిన ఇజ్జు ఆదమ్మ, తిరుమరెడ్డి లక్ష్మీకాంతమ్మ నివాసం ఉంటున్న పూరి ఇల్లు శనివారం దగ్ధమ య్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు అస్తి నష్టం వాటిల్లింది. స్థానిక నాయుకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మండల బీజేపీ నాయకులు మంగళవారం బాదిత కుటుంబాలను పరామర్శించి రైస్ బ్యాగులు, వంట సామాన్లు, నిత్యవసర సరుకులను అందజేశారు.బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం,చిరంజీవి, త్రినాధరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

**-పీపీపీతో వచ్చే తరాలకు అంధకారమే**

**-కోటి సంతకాలతో కూటమి సర్కార్‌కు కనువిప్పు కావాలి**

**-ప్రైవేటీకరణ ఆగే వరకు వైయస్సార్సీపీ పోరాటం**



**పలాస, డిసెంబరు 2(వార్త):** కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైద్య విద్య ప్రైవేట్ కరణతో వ్యాధులను నష్టపోతారని, ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తున్నందుకు నిరసనగా వైయస్సార్సీపి చేపట్టిన కోటి సంతకాల సేకరణతో కూటమి సర్కార్‌కి కనువిప్పు కలిగి ఈవిధానాన్ని వెనక్కి తీసుకోవాలని వైయస్ఆర్సీపీ పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి , వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం నాయకులు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ సంయుక్తంగా ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల 20 వార్డు శివాజీనగర్‌లో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ చేసినందుకు నిరసనగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అమ్మలకు నోచుకోని హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని, ఏడు మెడికల్ కాలేజీలను తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాల ప్రైవేటీకరణ చేసిన తీరు వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీలను వారి అనుకూలమైన వారికి దోచి పెట్టేందుకు పీపీపీ విధానం తీసుకుని రావడం అన్యాయమని అన్నారు. 66 ఏళ్ల పాటు ప్రభుత్వం లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్రంతో మాట్లాడి 17 మెడికల్ కాలేజీలను ఒకేసారి రాష్ట్రంలో ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఈ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు తగ్గ జీవో జారీ చేయడం వల్ల, భవిష్యత్తు తరాల విద్యార్థులకు అన్యాయం చేసిన వారవుతామని , వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆగే వరకు వైయస్సార్సీపి చేస్తున్న పోరాటం ఆగదని గోపి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్సిపి కార్యకర్తలు చింతల బాబూరావు, మూల దయాకర్, గజ్జి బాలయ్య, బమ్మిడి సుధాకర్, శేఖర్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సమాయత్తమవ్వాలి



**పలాస, డిసెంబరు 2(వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుండే సమాయత్తం అవ్వాలి అని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని 7,18,19,54 బూతు కన్వీనర్, కో కన్వీనర్లు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. పార్టీ ఆదేశలతో బూత్ పరిశీలకులుగా ఆయా బూత్ పరిధిలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, రాబోయే రోజుల్లో ఎలా ముందుకు వెళ్ళాలో వివరించారు.పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా ప్రచారం చేసేందుకు అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ తో విజయదుందుభి మ్రోగించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, మున్సిపాలిటీ అధ్యక్ష కార్యదర్శులు ముఖ్య నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం




**పలాస, డిసెంబరు 2(వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ప్రిన్సిపాల్ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం యొక్క ప్రాధాన్యం, అవసరం, ప్రతి విద్యార్థి కనీస కంప్యూటర్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ బి. నరసింహులు, హిందీ అధ్యాపకురాలు వై. వెంకటలక్ష్మి, కంప్యూటర్ విభాగ అధ్యాపకులు పీ.తారకేశ్వరరావు, హేమరాజు, ఇతర విభాగాల అధ్యాపకులు పి.వి.సత్యనారాయణ, ఎం.హేమాచలం, బి.ప్రసాద్‌రావు, వై.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెగా పీటీఎంను జయప్రదం చేయండి



**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న మెగా పీటీఎం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తెలిపారు. మంగళవారం నరసన్నపేట ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్ఎంటీలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లి దండ్రులకు తప్పనిసరిగా ఆహ్వాన పత్రాలను అందజేయాలన్నారు. అలాగే విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు కూడా సిద్ధం చేయాలని, భోజనం ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

## శ్మశానానికి స్థలం కేటాయించరూ..!



**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** గడ్డియ్య పేట వద్ద ఉన్న జగనన్న కాలనీలో సుమారు 900 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని స్థానిక మహిళలు తెలిపారు. అయితే తమకు శ్మశానవాటిక లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణకు మహిళలు వినతి పత్రం సమర్పించారు. చనిపోతే మృతదేహాలను ఖననం చేసేందుకు ఎన్నో అవస్థలు పడుతున్నామని, స్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరారు.

## మాకివలసలో ఉచిత వైద్య శిబిరం

**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఇవాళ నిర్వహించారు. ఈ కార్యక్రమం వైద్యులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరగగా 82 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశామని ఆయన తెలిపారు.



# అందరిని సేవించు-అందరిని ప్రేమించు ఆచరించాలి



**పలాస, డిసెంబరు 2(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తన అవతార దివ్య సందేశాలలో ఎల్లప్పుడూ ముఖ్యంగా అందరిని సేవించు-అందరిని ప్రేమించు అని ఆచరణలో చూపించాలని శ్రీ సత్య సాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశం అన్నారు. ప్రతీవారు వారి వారి రోజువారీ ఖర్చులు తగ్గించుకొని (సెయిలింగ్ ఆన్ డెసిరీస్-కోడ్) తద్వారా పొదుపు చేసిన మొత్తంతో, సమాజానికి సేవలు చేయమని సందేశాన్ని ఇచ్చేరని, శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణాపురము విద్యార్ధ్ని విద్యార్థులు, గత 10 సంవత్సరాల నుంచి వాళ్ళ వాళ్ళ పాకెట్ మనీలో కొంత మిగిల్చికొంటూ, తద్వారా మిగిలిన మొత్తంతో ప్రతీనెల 1వ తారీఖున నారాయణసేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. షిర్డీసాయి మందిరం దగ్గర్లో ఉన్న నారాయణలకు ఆహార ప్రసాదం స్వామివారి విభూతి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిని సేవించు, అందరిని ప్రేమించు" అనేది ఒక అత్యంత మహత్తరమైన జీవన సూత్రము అని అన్నారు. ఇది మన జీవితంలో అన్యోన్యత, సామాజిక సమన్వయానికి ప్రాధాన్యతను తెలియజేస్తుందని తెలిపారు. ఈ సూత్రం ప్రకారం, మనం ప్రతి వ్యక్తిని దయ, సహనం, ప్రేమతో చూసి, వారికి సేవ చేయడం ద్వారా సమాజంలో మంచి సంబంధాలు, శాంతిని నెలకొల్పగలమాని వెల్లడించారు. ఈ సూత్రం ఆధ్యాత్మిక, సామాజిక, మానసిక స్థాయిలలో మనిషి ఎదుగుదలకు దారి చూపుతుందాని తెలిపారు. అందరిని ప్రేమించడం అంటే వర్గ భేదాలు, ఆర్థిక స్థితిగతులు, జాతులు, లింగాలు అన్నిటిని మించి, హృదయపూర్వకంగా సవరించటం. అందరిని సేవించడం అంటే మన సహాయ హస్తాలను విస్తరించి, అవసరానికి తగినంత సహాయం అందించడమని చెప్పారు. కార్యక్రమంలో నారాయణసేవా ఇన్‌చార్జి దాలేటి, హేమ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజలను మభ్యపెడుతున్నారు

**మందస, డిసెంబరు 2(వార్త):** కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి భూములు ఇవ్వమని రైతులు చెబుతున్నప్పటికీ, అధికారులు మభ్య పెడుతున్నారని కార్గో వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు అన్నారు. ఈ మేరకు వారు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో కార్గో ఎయిర్పోర్ట్ ప్రభావిత గ్రామాల్లో ఆర్డీఓ, డిఆర్ఓ పర్య టించగా ఆయా ప్రాంతాల రైతులు కార్గో ఎయిర్పోర్ట్ కి సెంటు భూమి కూడా ఇవ్వమని, మీ ముందే చెప్పారన్నారు. అయినా ఆర్డీవో, డీఆర్ఓలు ప్రెస్ మీట్ పెట్టి రైతులకు నచ్చ చెప్తామని, ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని, ప్రజాభిప్రాయ సేకరణ చేసి.. ముందుకు వెళ్తామని పత్రికాముఖంగా ప్రకటించడం హాస్యస్పదంగా ఉందన్నారు. రాంపురం, బిడిమి, గంగువాడ, అనకాపల్లి, సంతోష్ నగర్ తదితర గ్రామాల్లో రైతులు తమ భూములు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు ఇచ్చేదే లేదని పోలీసు నిర్బంధాలు పెట్టి, అధికారులు పర్యటించినప్పుడు కూడా రైతులందరూ స్పష్టం చేశారు. ప్రభావిత గ్రామాల నుండి వందలాదిమంది ఆర్డిఓ కార్యాలయానికి వెళ్లి రిప్రజెంటేషన్ చేస్తామని, ఎయిర్పోర్ట్ మాకు వద్దని ర్యాలీ, ధర్నాలతో ప్రభుత్వానికి తెలియజేస్తామని, అనుమతులు పెట్టుకున్నప్పుడు కూడా అనుమతులు మంజూరు చేయలేదన్నారు. పోలీసు నిర్బంధాలు పెట్టి వామపక్ష నాయకుల అరెస్టులు చేసి, మళ్లీ ఎయిర్పోర్ట్ మీద ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ఇటువంటి ప్రకటనలు చేయవద్దని వారు కోరారు.

# మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రాప్తికే మహిళా రుణాలు



**మందస, డిసెంబరు 2(వార్త):** మహిళా స్వయం శక్తి సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రాప్తికే ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు రుణాలను మంజూరు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు తెలిపారు. స్థానిక గ్రామీణ బ్యాంకు మేనేజర్ కరస జనార్ధన్ ఆధ్వర్యంలో వెలుగు సిబ్బందితో నిర్వహించిన కన్వర్జెన్స్ మీటింగులో పాల్గొని మాట్లాడారు. వెలుగు ఏపిఎం పైడి కూర్మారావు మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులను బ్యాంకుల చుట్టూ తిప్పకుండా గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న గ్రామ సంఘం సమావేశాల దగ్గర పొదుపులు అప్పులు కట్టించుకొని సీఎస్పీల ద్వారా రసీదులు ఇచ్చే విధానం మెరుగుపరచాలన్నారు. ఇంటర్నల్ లెండింగ్ మరియు ఫిక్స్ డిపాజిట్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బ్యాంకులో అప్పు కట్టిన సంఘాలకు పాస్ బుక్కు ప్రింటింగ్ లేకపోవడం వల్ల కొన్ని సంఘాలలో సమస్యలు వస్తున్నట్లు రీజనల్ మేనేజర్ గారి దృష్టికి తీసుకువచ్చారు. హరిపురం బ్యాంక్ మేనేజర్ ఉమా శంకర్ మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులకు ఎం.సీ.పీ. ప్రకారం లింకేజీలతోపాటు ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ లో భాగంగా లక్పతి దీదీ లకు వ్యక్తిగత రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు.

కార్యక్రమంలో డస్క్ ఆఫీసర్ మిదునేష్ తో పాటు బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు, లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.వో.ఏ.లు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్




**పలాస, డిసెంబరు 2(వార్త):** పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవ పథకంలో భాగంగా మంగళవారం గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గోవిందపురం గ్రామంలో పుచ్చ వీధి, గొల్లవీధి, పాఠశాల, బజారు వీధి, సాయిరాం వీధి తదితర వీధుల్లో పిచ్చి మొక్కలు,మురుగు నీరు తొలగించి బ్లీచింగ్ చల్లారు. అదేవిధంగా తెలుగు అధ్యాపకులు కేశవరావు వాలంటరీలకు స్కిల్ డెవలప్మెంట్ పై అవగాహన కలిపించారు. అనంతరం క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ పీవో ఎస్ రూప్ సుందర్, అధ్యాపకులు ఝాన్సి, రాంబాబు, శోభ, భాగ్యవతి, ఆలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

## మార్పు కోసం మహిళల ముందడుగు



**మందస, డిసెంబరు 2(వార్త):** వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి, ఆర్థిక సాధికారతకు మహిళలే ముందడుగు వేస్తూ, గ్రామాలలో మహిళా సంఘాలకు జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా క్రియాశీల అవగాహన కల్పించాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. మందస ప్రధాన కేంద్రంలో గల సచివాలయ ఆవరణలో జండర్ ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న హ్యూమన్ డెవలప్మెంట్ యాక్టివిటీస్ లో భాగంగా మహిళా సంఘాల సభ్యులు పూర్తి అవగాహనతో హింసకు తావులేని కుటుంబాలు, జండర్ ఈక్విటీ సమాజం దిశగా పయనించాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు రమణమ్మ, శారద, శైలజలతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వీఓఏ, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని రక్షించాలి




**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దాడ లత పేర్కొన్నారు. మంగళవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాలుష్య నియంత్రణ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించుకోవడంతో వాటిని కాపాడుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు

**జలుమూరు, డిసెంబరు 2 (వార్త):** జలుమూరు మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీఎస్ ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. జలుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ క్రీడలను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఈఓలు తెలిపారు. గెలుపొందిన టీములు డివిజన్ స్థాయికి ఎంపిక అవుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మంత్రి లోకేష్‌ను కలిసిన టిడిపి మండల అధ్యక్షుడు కుమరాపు



**జి.సిగడాం, డిసెంబరు 2(వార్త):** వివిధ మండలాల టిడిపి మండల అధ్యక్షులతో అమరావతి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ క్షేత్రస్థాయి నాయకత్వంలో బలోపేతం చేసే లక్ష్యంతో పని చేయాలని విద్యా,ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మండల నాయకులకు పలు సూచనలు అదేశించారు. ఈ సమావేశానికి జి.సిగడాం మండల టిడిపి అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్, కుదిరెళ్ల బుజ్జి పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారా లోకేష్ ను కలిసి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో ఎచ్చెర్ల నియోజకర్గం జి.సిగడాం అభివృద్ధి జరుగుతుందని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసి మా వంతుగా పార్టీని మరింత బలోపేతంకు కృషి చేస్తామని అయన దృష్టి లో పెట్టారు. వీరి ఇద్దరకు అభినందనలు తెలిపారు.

# మందస ప్రజల పోరాటానికి వామపక్షాల మద్దతు

**-ప్రజా ఆస్తులను ప్రభుత్వమే కాపాడాలి**

**-వామపక్ష పార్టీల డిమాండ్**

**కాలేజీ ప్రిన్సిపాల్‌తో చర్చలు జరిపిన వామపక్ష నాయకులు**



**మందస, డిసెంబరు 2(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కలాశాలను వామ పక్ష నాయకులు పరిశీలన చేశారు. మందస ప్రజల ఆస్తులను దురాక్రమించడానికి పంపిన కోర్టు నోటీసులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి వామ పక్ష నాయకులు మద్దతు ఇస్తున్నామన్నారు. అనంతరం వారు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస గ్రామ ప్రజలు, కాలేజీకి ఆనుకొని ఉన్న శివాలయం, 1981లో మందస రాజు వాసుదేవాలయం పక్కన తన ఆధీనంలోనున్న 1.40సెంట్లు భూమిని కాలేజీ నిర్మాణానికి కేటాయించారు. గ్రామస్తుల సహకారంతో గత 50 సంవత్సరాల నుండి ప్రభుత్వం కాలేజీగా నిర్మాణంలో ఉంది. వీటిని ఎండోమెంట్ భూములని చెప్పి కోర్టులను మేనేజ్ చేస్తున్న స్వామి కొంతకాలంగా ఈ కళాశాలను దానికి ఆ నుంచి ఉన్న గోపాల సాగరం, శివాలయాన్ని, కూరగాయలు పండించుకుంటున్న చిన్న రైతులని, గుడి వెనుక నున్న జిరాయితీ భూములతో సహా ఎకరాల భూమిని దురాక్రమించడానికి ప్రజలపై వాజ్యాలు వేస్తూ కోర్టులు చుట్టూ తిప్పడాన్ని ప్రజలు ముక్త కంఠంతో ఖండిస్తూనే ఉన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఉపయోగించుకొని ప్రజల ఆస్తులు కొల్లగొట్టాలని ప్రయత్నం చేసినట్టయితే ప్రజా ప్రతిఘటనని ఎదుర్కోవలసి వస్తుందని ప్రజాసంఘాలు అభిప్రాయ పడ్డాయి. గోపాలసాగరం జలవనరులు వేలాది ఎకరాల భూమికి ఆయుకట్టుగా ఉండి సాగునీరు అందిస్తుంది. అలాంటి ఈ సాగరాన్ని దురాక్రమిస్తే ఎంతోమంది పేద రైతులు సాగునీరందక వీధిన పడడమే కాకుండా రెండు పంటలు పండే ఈ భూములు పడావు భూములుగా మిగిలి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేద పాఠశాల పేరుతో, సంత స్థలాన్ని దురాక్రమించి తమ సొంతానికి వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి పరచి మందసలో డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయాలి కానీ వున్న కాలేజీని ఆక్రమిస్తామని అనుకుంటే ప్రజాభంగపాటకు గురికాక తప్పదని స్వామికి హెచ్చరించారు. అయ్యప్పస్వాములు శివాలయం ఆవరణలోని ఖాళీ స్థలంలో సన్నిధానాన్ని నిర్మించుకుంటే దాని నిర్మాణానికి వాసుదేవ పెరుమాళ్ కు చెందిన వ్యక్తులు అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. అయ్యప్ప స్వాములు సన్నిధానాన్ని అడ్డుకోవడం వారి కుహనా భక్తకి నిదర్శనమని దుయ్యబట్టారు. కాలేజీ, సాగరం, సంత స్థలంతో పాటు జిరాయితీ భూములకు సంబంధించి కూడా అన్ని రకాల భూ రికార్డులు ఉన్నప్పటికీ స్వామి మొండిగా వ్యవహరిస్తూ దురాక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మందస జూనియర్ కాలేజీని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న చర్యలకు వ్యతిరేకంగా మందస ప్రజలు నిలవాలని వారికి అన్ని విదాల మద్దతు పలుకుతామని సీపీఐ ఎంఎల్ జనశక్తి నాయకులు కోనేరు రమేష్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు మద్దిల రామారావు, గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు ఎస్. నరసింగరావు, మాధవరావు, జ్యోతి, ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు 10 మంది ఎంపిక



**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** సత్యవరం ఉన్నత పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు జాతీయ స్థాయి గట్కా పోటీలకు ఎంపికైనట్లు పీడీ జ్యోతి రాణి తెలిపారు. వచ్చేనెలలో పంజాబ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. వీరిని స్థానిక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంగళవారం సన్మానించారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బొమ్మాలి కగేశ్వరరావు, సూరపు సురేష్ కుమార్ గట్కా క్రీడలో శిక్షణ గత ఆరు నెలల నుండి శిక్షణ అందిస్తున్నారు.

## శిథిలావస్థలో అంగన్వాడీ భవనాలు.. పరాయి పంచన సేవలు..!



**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** నరసన్నపేట మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పరాయి పంచన సేవలు అందించే పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో మొత్తం 115 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 98 కేంద్రాలకు భవనాలు ఉన్నాయి. వీటిలో సుమారు పదికి పైగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మరో 17 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. భవానిపురం అంగన్వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది తెలిపారు.

## రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌కి సన్మానం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 2(వార్త):** ఇచ్చాపురం బెల్లుపడలో రైతులు గ్రామ పెద్దలు, యువకులు స్టేట్ రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు .రైతులు సమస్యలు కొండ శంకర్ రెడ్డి దృష్టికి తీసుకొనివచ్చారు. సమస్య ను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ద్వారా పరిస్కరిస్తానని అని తెలిచేసారు. ఈ పదవి ఇచ్చినదుకు ఎమ్మెల్యే కు ఎపుడు రుణపడి ఉంటానని,అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు మరియు ఎద్యుకేషన్ మినిస్టర్ నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమస్యలపై పరిశీలకులతో చర్చ



**ఇచ్ఛాపురం, డిసెంబరు 2(వార్త):** ఇచ్ఛాపురం పరిశీలకులు వజ్జ బాబురావు, పైలా శ్రీనివాస్ లతో నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో నున్న ముఖ్య అంశాలపై మండల తెలుగుదేశం నాయకులు కలిసి చర్చించారు.పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లోపింటి పద్మనాభం ,దక్కత కామేశ్వరరావు, ఇచ్ఛాపురం మండలం నాయకులు పాల్గొన్నారు.

## బాలిగాం ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ లక్ష్మణరావు

**మందస, డిసెంబరు 2(వార్త):** బాలిగాంలో గల ఆదర్శ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు సందర్శించారు. పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు 65మంది విద్యార్థులుండగా, వారంతా అకడమిక్ స్టాండర్డ్స్ లో, ఎఫ్ఎల్ఎన్ బోధన ద్వారా విద్యార్థులు చాలా చురుకుగా ఉన్నారని ఎంఈఓ చెప్పారు. వర్క్ బుక్స్, అసెస్మెంట్ బుక్ లెట్స్, మూల్యాంకన పుస్తకాలు, పరిశీలించారు. విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు, సహోపాధ్యాయులు చక్కగా క్లాసెస్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పాఠశాల ఎంతో చక్కగా ఉందన్నారు. జాదూయి పిఠార కిట్ ను ఉపయోగించి బోధించే విధానం బాగుందని, మేథ్స్ తో పాటు ఆంగ్లం, తెలుగు, పరిసరాల విజ్ఞానం అన్ని సబ్జెక్టులపై విద్యార్థులు మంచి సాధన కలిగి ఉన్నారని, ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం జరుగుచున్నదని, విద్యార్థులు అందరూ ఆనందంగా భోజనం చేయడం సంతృప్తిగా ఉందన్నారు. టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉన్నాయని, డిసెంబర్ 5వ తేదీ న జరగాల్సిన మెగా పి.టి.ఎం(మెగా పెరేంట్స్ టిచర్ మీటింగ్) ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్ కుమార్ పాత్రో, బి.పురుషోత్తం, యానాది సుజాత ఉన్నారు.



## రైస్ మిల్లుని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**ఎల్ఎన్ పేట, డిసెంబరు 2(వార్త):** రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఎల్ ఎన్ పేట మండల పరిధిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. మిల్లులో అనధికారికంగా ధాన్యం నిల్వలు ఉండరాదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇంటర్నెట్ సిగ్నల్స్ సంబంధించి సాంకేతిక సమస్యలు ఉంటే వైఫై ని వినియోగించుకొని రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ తో పాటు ఎల్ ఎన్ పేట తహసిల్దార్ జె.ఈశ్వరమ్మ, వీఆర్వో రమణమ్మ తదితరులు ఉన్నారు.

## జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు బొడ్డపాడు విద్యార్థి



**పలాస, డిసెంబరు 2(వార్త):** ఏపీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడం కోసం భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం),ఏపీ సైన్స్ సిటీ, అపకాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్లైన్ విధానంలో నిర్వహించిన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొడ్డపాడు 8వ తరగతి విద్యార్థి పోతనపల్లి చిరంజీవి క్విజ్ పోటీలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు . 27 డిసెంబర్ 2025న నేషనల్ సంస్కృత యూనివర్సిటీ, తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు మన జిల్లా జట్టు తరపున పాల్గొనబోతున్నాడు అందుకు ఆ అబ్బాయికి అభినందనలు తెలుపుతూ భవిష్యత్లో మరిన్ని మైలు రాయులను అధిగమించాలని కోరుతూ కకిక్కర ఢిల్లీరావు శుభాకాంక్షలు తెలిపారు.

## అచ్యుతాపురం వైద్యురాలికి ప్రశంసాపత్రం



**జలుమూరు, డిసెంబరు 2 (వార్త):** అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పూజారి సుజాతకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అభినందించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా సోమవారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో సుజాతకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని ఆయన అంద జేశారు. రోగులకు మరింత సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్ బాబు, జిల్లా వైద్యాధికారిణి అనిత పాల్గొన్నారు.

## టిడిపి శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే శిరీష

**పలాస, డిసెంబరు 2(వార్త):** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్న పలాస శాసనసభ్యులు గౌతు శిరీష, ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ బెందాలం అశోక్ బాబు గారు పలు అంశాలపై నాయకులతో మాట్లాడి పార్టీ సంస్థాగత, విధులు అంశం మీద వివరించారు. పార్టీ లో నాయకులతో సమన్వయం చేసుకుంటూ మరింత బలోపేతం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పని చేయాలని సూచించారు. ఈ శిక్షణా తరగతులకు మందస మండల పార్టీ అధ్యక్షులు భావన దుర్యోధన, ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు హాజరయ్యారు.



# విద్యార్థినిల బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**-రాష్ట్ర గురుకులాల అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్ -మందస గురుకులం ఆకస్మిక సందర్శన**



**మందస, డిసెంబరు 2(వార్త):** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయాల రాష్ట్ర అదనపు కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్.. రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలను చక్కగా చూసుకోవాలని, వారి బాగోగుల బాధ్యత నిర్వాహకులదేనన్నారు. విద్యార్థినిల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, పరీక్షలు దృష్ట్యా ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రిపుల్ ఐటీ, నీట్ ఎంట్రన్స్ పరీక్షలపై ప్రత్యేక సూచనలు, సలహాలిచ్చారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ ఫలితాలు శతశాతం సాధించాలన్నారు. ఏ1 గ్రేడులు 50శాతం తప్పక వచ్చేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినిలతో ప్రత్యేకంగా మాట్లాడిన సునీల్ రాజ్కుమార్ విద్యాభివృద్ధి, సమాజం, పరీక్షలు, భవిష్యత్ లో తీసుకోవాలని నిర్ణయాలను వివరించారు. డార్మిటరీ, మెస్, మరుగుదొడ్లు, స్టోర్రూం, డైనింగ్ హాల్, ఆడిటోరియం తనిఖీ చేశారు. విద్యార్థినిలకు అందిస్తున్న ఆహారాన్ని కూడా పరిశీలించారు. గురుకులం పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా కోఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి, మందస ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్, సిబ్బంది ఉన్నారు.



# డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంపై అవగాహన




**జలుమూరు, డిసెంబరు 2 (వార్త):** మాదకద్రవ్యాలు వద్దు బ్రో అనే నినాదంతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ర్యాలీ, మీటింగ్లను జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది మండల పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని, డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కల్పించారు. సోమవారం జలుమూరు మండలంలోని జరిగిన ర్యాలీ కార్యక్రమానికి స్థానిక పోలీసులు పాల్గొని, ప్రసంగించారు. మనమందరం కలిసి మాదక ద్రవ్య రహిత జిల్లాగా, రాష్ట్రంగా మన సమాజం కోసం నడుంబిగించకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదని, సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక పోలీసుగా భావించి మాదక ద్రవ్యాలపై యుద్ధం చేయాలన్నారు. మన ఆశయాలు ఏమిటి, మన గమ్యం ఎటు వైపు అనే ఆలోచనతో ఇప్పటి నుంచే క్రమశిక్షణతో భవిష్యత్తు వైపు అడుగు వేయాలన్నారు. ప్రజలు, భావిభారత పౌరులను పోలీసులు కోరేది ఒక్కటే అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన సంఘటనలను అరికట్టడానికి.. మాదకద్రవ్య రహిత సమాజాన్ని సృష్టించేందుకు తమ ప్రయత్నాలకు ప్రజల మద్దతు ఎంతైనా అవసరమన్నారు. మీకు ఏదైనా సమాచారం ఉంటే, సహాయం కావాలంటే దయచేసి మా హెల్ప్ లైన్ నంబర్లు 112,1972 నంబర్లలో సంప్రదించాలన్నారు. కలిసినడుద్దాం సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకుందామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జలుమూరు ఎస్ఐ అశోక్ బాబు, స్టేషన్ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలి




**జలుమూరు, డిసెంబరు 2 (వార్త):** జలుమూరు ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ డే దినోత్సవాన్ని వైద్యులు డాక్టర్ జి.సుజాత, డాక్టర్ మూల సంధ్యరాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆవిడ మాటాడుతూ ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించాలి. కానీ వ్యక్తిని కాదు, ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు కాబట్టి నేటి యువత లైంగిక సంపర్కాలపై అప్రమత్తం గా ఉండి ఈ వ్యాధిని మన సమాజం నుండి తరిమికొట్టాలని సూచించారు. అలానే పూర్వం మందులు లేని కారణంగా ఎయిడ్స్ అంటే మరణ శాసనంగా భావించే వారని, కానీ నేడు వైద్య రంగం అద్భుతమైన పురోగతి సాధించిందన్నారు. సరైన సమయంలో హెచ్ఐవీని గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడితే బాధితులు కూడా సాధారణ వ్యక్తుల మాదిరిగానే ఆరోగ్యకరమైన, దీర్ఘకాలిక జీవితాన్ని గడపవచ్చని భరోసా ఇచ్చారు. ఎయిడ్స్ అనేది కేవలం ఒక అనారోగ్యం మాత్రమేనని, బాధితులతో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించడం, వారిని దగ్గరకు తీసుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని ఉద్ఘాటించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిహెచ్ యస్ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్ చిన్నరాజులు, హెచ్ వి లలితా, సీనియర్ అసిస్టెంట్ విజయశాంతి, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, ల్యాబ్ టెకినీసియన్ రాజారావు, ఆయుష్ ఫార్మాసిస్ట్ కృష్ణారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






## సర్వేలను వేగవంతం చేయాలి

**జి.సిగడాం, డిసెంబరు 2(వార్త):** స్వామిత్ర సర్వేలను వేగవంతం చేయాలని పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించరాదని డిల్పీవో గోపీబాల అన్నారు. జి.సిగడాం, గెడ్డకంచరాం, గొబ్బూరు తదితర గ్రామాలలో మంగళవారం నిర్వహించిన స్వామిత్ర సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తిచేసిన పిదప హక్కు పత్రాలను లబ్దిదారులకు అందజేయాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహించకుండా భాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే చెత్తసంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈయన తో పాటు ఎంపీడీవో జి రామకృష్ణారావు. పంచాయితీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహూ, తదితరులు ఉన్నారు.

## గదిలి వెంకట సూర్యనారాయణకు సన్మానం



**నరసన్నపేట, డిసెంబరు 2 (వార్త):** గోపాలపెంటలో గౌరవ డాక్టరేట్ డిగ్రీ పొందిన గదిలి వెంకట సూర్యనారాయణ కి ఘన సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు ధర్మాన కృష్ణదాస్ హాజరై ఆశీస్సులు అందించారు. గ్రామ అభివృద్ధిలో సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బూత్ కమిటీ అధ్యక్షుడు బబ్బోది ఈశ్వరరావు, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖర్ రావు, సర్పంచ్ ఎండ కృష్ణవేణి, ఎంపిటిసి గదిలి మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ తోట అప్పారావు, గ్రామ అధ్యక్షుడు గదిలి రమేష్, రాష్ట్ర సోషల్ మీడియాలో కార్యదర్శి కనపల అరవింద్, మండల యూత్ ఉపాధ్యక్షులు తోట భార్గవ్, తోట అచ్యుత, సబ్బ రాము, సనపల రమేష్, గదిలి ప్రసాద్, గదిలి అప్పలరాజు, ఈగల రాజారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా అతిథులు సూర్యనారాయణ కి శాలువా కప్పి సన్మానించి, గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. స్థానికులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఏఐసిసి ఓబిసి విభాగపు జాతీయ కోఆర్డినేటర్‌గా డా.జీవితేశ్వరరావు



**పలాస, డిసెంబరు 2(వార్త):** అఖిలభారత కాంగ్రెస్ కమిటీ( ఏఐసిసి) ఓబీసీ విభాగపు జాతీయ కోఆర్డినేటర్ గా కాశీ బుగ్గకు చెందిన ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ జీవితేశ్వర రావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఓబీసీ చైర్మన్ అనిల్ జైహింద్, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసి వేణుగోపాల్ నుండి ఉత్తర్వులను అందుకున్నారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సిఫార్సుల మేరకే నియామకం జరిగిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవితేశ్వర రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం అధిష్టానం కల్పిస్తారనడానికి తన నియామకమే ఉదాహరణ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో పని చేయడం అదృష్టమని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడం భారతదేశ పౌరుషత్వం కలిగి ఉన్నట్లేనని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉందని అన్నారు. భారతదేశ లౌకికతత్వానికి, భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఈ దేశానికి అత్యవసరమని అన్నారు. వెనుకకు నెట్టబడిన శ్రీకాకుళం జిల్లా కు చెందిన తనను గుర్తించి జాతీయ స్థాయిలో సముచిత స్థానం కల్పించినందుకు గాను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఈ సందర్భంగా అయన కృతజ్ఞతలు తెలిపారు.

## బైకిస్టుకు జైలు శిక్ష, జరిమాన



**సారవకోట, డిసెంబరు 2 (వార్త):** ద్విచక్ర వాహనదారుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ పాతపట్నం సివిల్ జడ్జ్ రోషిని తీర్పునిచ్చారు. 2019 అక్టోబర్లో సారవకోట మండలం కేళవలస వద్ద ఉమ్మడిశెట్టి రామారావు రహదారిపై ద్విచక్ర వాహనంతో కొల్లి నారాయణమ్మను ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందింది. అప్పటి సారవకోట ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేశారని ఎస్ఐ అనిల్ తెలిపారు. ఈ కేసులో కోర్టు రామారావుకు ఆరు నెలలు జైలు శిక్ష విధించారు.

## అధ్వానంగా దేవుపురం-కొండలోగాం రహదారి నిర్మాణం

### -నాణ్యతా లోపమంటున్న గిరిజనులు



**మందస, డిసెంబరు 2(వార్త):** దేవుపురం నుంచి గిరిజన ప్రాంతాల మీదుగా కొండ లోగాం వరకు నిర్మిస్తున్న తారురోడ్డు అధ్వాన్నంగా ఉందని, నాణ్యతా లోపంగా ఉందని గిరిజన సంఘం నాయకులు సవర నరసింగరావు, సవర హరిక్రృష్ణ, కొండలోగాం సర్పంచ్ ప్రతినిధి సవర ఢిల్లేశ్వరరావులు ఆరోపించారు. ఈ మేరకు పనలను వారు పరిశీలించారు. తక్కువ మందంతో వేసిన రోడ్డు ముక్కలు ముక్కలుగా ఊడిపోతోందన్నారు. నాణ్యత లేని రహదారి నిర్మాణం చేస్తూ గిరిజనులకు అన్యాయం చేశారన్నారు. దీనిపై పోరాటం చేస్తామన్నారు. భవిష్యత్ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.



# పలాస జిల్లా సాధనకు 4న రౌండ్ టేబుల్

### -వేదికగా'గాలి మేడ'

### - ప్రజా సంఘాలు, మేధావులకు బాబా పిలుపు

**పలాస, డిసెంబరు 2(వార్త):** ఎన్నో దశాబ్దాలుగా ' పలాస ' కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని తెలియజేసేందుకు ఈనెల 4 వ తేదీన పలాస లోని పార్లమెంట్ మాజీ సభ్యులు, దివంగత డాక్టర్ కె. విశ్వనాథం వారి గాలి మేడ వద్ద వివిధ ప్రజా సంఘాలతో పాటు మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త, న్యాయవాది దువ్వాడ శ్రీధర్ ( బాబా) ఒక ప్రకటన మంగళవారం విడుదల చేశారు. రాష్ట్ర విభజన అనంతరం పరిపాలన సౌలభ్యం తోపాటు పాలనను ప్రజలకు చేరువ చేయడం కోసం ప్రభుత్వాలు కొత్త జిల్లాల ఏర్పాట కు శ్రీకారం చుట్టడం హర్షనీయమైనప్పటికీ, వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లాలో పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఆ అంశం కార్యరూపం దాల్చకపోవడంతో ఈప్రాంత ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని దువ్వాడ శ్రీధర్( బాబా ) ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జిల్లాలు ఏర్పాటు చేయడానికి గల కారణాలు పరిశీలిస్తే, పరిపాలనలో మెరుగుదల, కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల మౌలిక రంగ సదుపాయాలైన రోడ్లు, విద్య, వైద్యం, విద్యుత్తు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలు ప్రభావితం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాక ప్రజల సౌలభ్యం కోసం తమ పనుల కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుందని, దీనివల్ల వారికి సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.




వాస్తవానికి పలాస జీడి వ్యాపారం పారిశ్రామిక వాడగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, దేశంలో నాణ్యమైన జీడి ఎగుమతులకు నిలయంగా గుర్తింపు ఉందన్నారు. పలాసను జిల్లాగా ఏర్పాటు చేస్తే ఉద్దానం ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఆశించారన్నారు. ఈ ప్రాంతంలో ఒక భారీ పరిశ్రమ కూడా లేకపోవడంతో జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే పరిశ్రమలు, పారిశ్రామిక వ్యాఖ్యలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూబ్ కడతారని అందరూ భావించారన్నారు. బహుద, మహేంద్ర తనయ నదులు, వంశధార కాలువ, ఇచ్చాపురం నుంచి సంతబొమ్మాలి మండలం వరకు 80 కిలోమీటర్ల పొడవునా సముద్రం తీరం కలిగి ఉండడంతో పరిశ్రమలు పెట్టడానికి అనువైన ప్రాంతం అన్నారు. ఇటీవల కాలంలో మూలపేట పోర్టు పనులు శరవేగంతో కొనసాగుతున్నాయని, ఈ పోర్టు వినియోగంలోకి వస్తే ఈ ప్రాంతం ఎంతో పారిశ్రామిక అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని దువ్వాడ శ్రీధర్ ( బాబా ) స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని, పలాస కొత్త జిల్లా ఆవశ్యకతపై సాధ్య సాధ్యులను అధికారులు అధ్యయనం చేశారని, ఈ దశలో ఈ ప్రాంత జనాభా, భౌగోళిక పరిసరాలు, పరిపాలన సౌకర్యాలు, వనరుల లభ్యతతో పాటు ఈ ప్రాంత సామాజిక పరిస్థితులు మొదలైన వాటిని పరిగణలోకి తీసుకుంటే నూటికి నూరు శాతం పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అందుకు కూటమి



ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు క్షేత్రస్థాయి నుంచి ప్రజాభీష్టం మేరకు సంతకాల సేకరణ తోపాటు పలు ప్రజా సంఘాలు, మేధావులు, డాక్టర్లు, న్యాయవాదులు, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, కార్మిక సంఘాలు, ఇతర పౌర సమాజ సంఘాలు స్వచ్ఛందంగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలుఅందజేసి, భవిష్యత్ కార్యాచరణకై స్పష్టమైన ఎజెండా రూపొందించేందుకు సహకరించాలని దువ్వాడ శ్రీధర్ ( బాబా) కోరారు.

### శ్రీముఖలింగేశ్వరక్షేత్ర యాత్రికుల


# వసతిగృహం పునఃప్రారంభం




**జలుమూరు, డిసెంబరు 2 (వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామి క్షేత్రంలో యాత్రికుల కోసం నిర్మించిన వసతి సముదాయం మరలా వార్తల్లోకి వచ్చింది. పర్యాటక శాఖ నిధులతో సుమారు 12 ఏళ్ల క్రితం 50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ యాత్రికుల వసతిగృహం, ఆరేళ్ల క్రితమే అప్పటి ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమైనప్పటికీ, ఉపయోగం లేక నిర్లక్ష్యానికి గురై వృథాగా నిలిచిపోయింది. ఇందుకు సంబంధించి పదిసార్లు పదిమంది కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించకుండా పోయాయని ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ తెలిపారు. చివరికి ప్రస్తుత జాయింట్ కలెక్టర్‌ను సమస్యపై అవగాహన కల్పించగా, వెంటనే స్పందించిన ఆయన ఆదేశాలపై ఎండోమెంట్స్ ఏసీ కార్యాచరణకు దిగారు. లక్ష రూపాయల నిధులతో వెంటనే మరమ్మతులు నిర్వహించి, ఈ అక్టోబర్ నెలలో వసతిగృహాన్ని పునఃప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఆలయం నుండి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న ఈ వసతి సముదాయం వద్ద సూచిక బోర్డులు లేకపోవడం చేత భక్తులు దాని ఉనికి గురించి తెలియక రహదారుల పక్కనే, బస్ స్టాండ్‌లోనే రాత్రులు గడపాల్సి వస్తోంది. ప్రస్తుతం చలికాలం కావడంతో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని అర్చకులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్థానిక ఎంపీడీవో, ఆలయ ఈవో కలిసి వసతిగృహానికి దారి చూపే సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, మీడియా ద్వారా భక్తులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

## బాధ్యతయుతంగా వ్యవహరించండి

### పిఎసిఎస్ అధ్యక్షుసలాన మోహనరావు



**మెళియాపుట్టి, డిసెంబరు 2(వార్త):** సామాజిక తనిఖీ సమయంలో అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరు సమన్వయంతో బాధ్యతయుతంగా వ్యవహరించాలని కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీవో రవి అధ్యక్షతన మంగళవారం నాడు జరిగిన సామాజిక తనిఖీ సమన్వ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో సుమారు 27 కోట్ల 70 లక్షల రూపాయలకు సంబంధించిన పనులకు తనికి నిర్వహణ జరుగుతుందని సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాలలో తనిఖీకి వచ్చే వారికి ఆయా దస్త్రాలు పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. సామాజిక తనిఖీ సమయంలో సంబంధిత శాఖధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, పంచాయతీరాజ్, ఐటీడీఏ తదితర శాఖల ద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి కొలతలు తీసుకొని నివేదిక తయారు చేసుకొని పై స్థాయి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, ఉపాధి హామీ పథకం ఏపీడి శైలజ, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తదితరులు అనేక అంశాలను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ప్రజా ప్రతినిధులు, ఏపీఓ రవి, ఈసీ తార ఆదినారాయణ రెడ్డి, డిఆర్పీలు శివ, రాజు, వెంకటేష్, పోలరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ కుటుంబానికి ఎస్‌జిఎఫ్ ఆర్థికసాయం

### -జాతీయ వార్త కథనానికి స్పందన

**కవిటి, డిసెంబరు 2(వార్త):** గొండియాల పుట్టుక గ్రామానికి చెందిన బైరెడ్ల రమేష్ అనే నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో నవంబర్ 13న" పెద్ద దిక్కును కోల్పోయిన పేద కుటుంబం" శీర్షికన జాతీయ వార్త ప్రచురించిన కథనానికి అనేకమంది మంచి మనసుతో స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థికంగా సహాయం అందజేశారు. ఇదే కోవలో మంగళవారం కవిటి మండలానికి చెందిన ఎస్ జి ఎఫ్ అనే స్వచ్ఛంద సంస్థ రమేష్ కుటుంబానికి అండగా నిలవాలన్నా సంకల్పంతో సభ్యులంతా చందాలు వేసుకొని 20500 రూపాయలు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో బాధ్యత కుటుంబీకులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరింతమంది యువకులు, సంఘాలు ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. మీరు సహాయం పట్ల గొండ్యాల పుట్టుక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.



## బైరిపురం అయ్యప్పల ఇరుముడి యాత్ర



**ఇచ్ఛాపురం, డిసెంబరు 2(వార్త):** కవిటి మండలం బైరిపురం గ్రామం అయ్యప్ప సన్నిధానం లో నలభై రోజులు దీక్ష పూర్తి చేసి పెంట శ్రీనివాస్ శర్మ గురుస్వామి, సనపల శ్రీనివాస్ గురు స్వామి, సప్ప గోపాల్ గురుస్వామి, మార్పు ప్రసాద్ గురుస్వామి, కడియాల వెంకటరావు గురుస్వామి, బందరు వేణుగోపాల్ గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నాలుగు గంటలకు ఇరుముడులు ధరించి ఇచ్చాపురం నుంచి శబరి యాత్రకు 32 మంది స్వాముల బయలుదేరారు మార్గమధ్య పలాసలో వారణాసి రామకృష్ణ అల్పాహారం ఏర్పాటు చేశారు. విశాఖపట్నంలో సోమవారం మధ్యాహ్నం సోంపేట మండలం లక్కవరం గ్రామస్తులు పండి వేణు స్వామి భిక్ష ఏర్పాటు చేశారు. వెళ్తున్న మార్గమధ్యంలో రాత్రి ఒడి పుల్లట ప్రవీణ్ (రైజ్ సంస్థల అధినేత )ఏర్పాటు చేశారు. మరుసటి రోజు మధ్యాహ్నం మంగళవారం బెంగళూరులో 32 మంది స్వాములకు బెంగళూరులో విధులు నిర్వహిస్తున్న బైరిపురం గ్రామ యువకులు స్వాములు అందరికీ మధ్యాహ్నం భిక్ష బెంగళూరు రైల్వే స్టేషన్లో ఘనంగా ఏర్పాటు చేశారు రాత్రి ఒడి బొర్రా మహేష్ ఏర్పాటు చేశారు.

### బీజేపీ ఓబీసీ మోర్చా శ్రీకాకుళం జిల్లా

## అధ్యక్షునిగా ధర్మారావు

### ❋ శ్రీకాకుళం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సింధూర

**శ్రీకాకుళం, డిసెంబర్2 (వార్త):** బీజేపీ ఓబీసీ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా లక్కోజు ధర్మారావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ పెద్దలు మధుకర్, గోపి శ్రీనివాస్‌తో పాటు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్, అధికార ప్రతి నిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, సవ్వాన ఉమామహేశ్వరి, పూర్వపు జిల్లా అధ్య క్షులు బిర్లంగి ఉమామహేశ్వరావులకు కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీలో ఎంతో కీలకమైన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించినందుకు బీసీ వర్గాలన్నింటిని కలుపుకొంటూ వెళ్లాలని జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సూచించినట్లు తెలిపారు. అన్ని విధా లుగా ప్రోత్సాహమందించిన ఓబీసీ మోర్చా జోనల్ ఇన్చార్జి రౌతు చిరంజీవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కో కన్వీనర్ పసుపులేటి సురేష్ బాబు సింగ్‌కు ధన్య వాదాలు తెలిపారు. అలాగే బీజేపీ శ్రీకాకుళం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా డాక్టర్ పైడి సింధూరను రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షులు ఎం.నిషిదా రాజు ఆదేశాల మేరకు బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరి పురం తేజేశ్వరరావు నియమించారు. డాక్టర్ పైడి సింధూరను ఆ పార్టీ నాయ కులు అభినందనలు తెలియజేశారు.

## టీడీపీ మండల అధ్యక్షులకు శిక్షణ

**శ్రీకాకుళం, డిసెంబర్2 (వార్త):** టీడీపీ మండల అధ్యక్షులకు నాయకత్వ లక్షణాలపై అమరావతిలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతం, నాయకత్వ లక్షణాల అభివృద్ధి, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణపై మండల అధ్యక్షులకు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడి బాధ్యతను వెల్లడించారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546